మేకలకు నీలి నాలుక వ్యాధి టీకాలు

శంషాబాద్: మల్కారం గ్రామంలో మేకలు, గొర్రెలకు ముందస్తు జాగ్రత్తగా వేస్తున్న నీలి నాలుక వ్యాధి టీకాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమాన్ని జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ మధుసూదన్ రావు పరిశీలించారు. పశువులకు అందుతున్న వైద్యంపై స్థానిక పశువైద్యాధికారి డాక్టర్ జి.శేఖర్ అడిగి తెలుసుకున్నారు. టీకాల కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయాలని సూచించారు. శుక్రవారం ఒక్క రోజే మొత్తం 877 మేకలు, గొర్రెలకు టీకాలను వేసినట్లు అధికారులు తెలిపారు.

విద్యార్థులు నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలి



టాలెంట్ హంట్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

బండ్లగూడ: విద్యార్థులు తమలోని నైపుణ్యాలను పెంపొందించుకుంటూ ఉత్తమ విద్యను అభ్యసించాలని ఆకాష్ ఇన్‌స్టిట్యూట్ సన్‌సిటీ సెంటర్ డైరెక్టర్ సూర్యకళారెడ్డి అన్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ సన్‌సిటీలోని సెంటర్‌లో శుక్రవారం ఆకాష్ నేషనల్ టాలెంట్ హంట్ 2025 కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రతి సంవత్సరం టాలెంట్ హంట్‌ను నిర్వహించి విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి ఉత్తమ ప్రతిభ కబరిచిన వారికి స్కాలర్‌షిప్‌లు అందించడంతో పాటు ఉచితంగా విద్యను నేర్పిస్తామన్నారు. ప్రతిభ గల విద్యార్థులు ఈ టాలెంట్ హంట్‌లో భాగస్వాములై రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

'డిజిటల్ వినియోగం'పై అవగాహన అవసరం



అవగాహన కల్పిస్తున్న ప్రతినిధులు

శంషాబాద్: సమాజం డిజిటల్ మయం అవుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో డిజిటల్ ఆవశ్యకతపై వయోధికులు కూడా అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని సైబరాబాద్ కమిషనరేట్ సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ కె.శంకర్‌రెడ్డి సూచించారు. ముచ్చింతల్ గ్రామంలో కిన్నెర వెల్ఫేర్ సొసైటీ, హెల్పేజ్ ఇండియా సీనియర్ సిటిజన్ కోసం ఏర్పాటు చేసిన డిజిటల్ సాక్షరత కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డిజిటల్ సేవలు పొందడంతో పాటు జరిగే పొరపాట్లను ఇందులో వివరించారు. వృద్ధులను లక్ష్యంగా చేసుకుని చేస్తున్న సైబర్ మోసాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కిన్నెర సంస్థ చైర్మన్ నాగచంద్రిక దేవి, హెల్పేజ్ ఇండియా ప్రతినిధి శ్యామ్, సీపీడీఓ శాంతి ప్రియ తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతపై అవగాహన



డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర అన్నారు. శుక్రవారం 5వ డివిజన్‌లోని సాయివర్ష కాలనీలో తడి, పొడి చెత్తపై ప్రజలకు అవగాహన కల్పించారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ క్లీనింగ్ ప్రక్రియను పరిశీలించి అవసరమైన సలహాలు, సూచనలు అందించారు. సన్‌సిటీ పబ్లిక్ టాయిలెట్స్ క్లీనింగ్ ప్రక్రియను సైతం పర్యవేక్షించారు. డిప్యూటీ ఈఈ జి.యాదయ్య, ఏఈఈ వి.రాజ్‌కుమార్, జి.వెంకట్‌రెడ్డి, వార్డు ఆఫీసర్ స్వాతి, బిల్ కలెక్టర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, ఆర్‌పీలు, శానిటరీ జవాన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆటోలో గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్

రాజేంద్రనగర్: గుట్టు చప్పుడు కాకుండా ఆటోలో ఎండు గంజాయిని తరలిస్తున్న ఇరువురిని శంషాబాద్ ఎక్సైజ్ పోలీసులు శుక్రవారం సాయంత్రం అదుపులోకి తీసుకున్నారు. ఇద్దరు నిందితుల వద్ద నుంచి ఆటోతో పాటు 4 కేజీల గంజాయి, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు ఇతర ప్రాంతాల నుంచి ఈ గంజాయిని తీసుకొచ్చి విక్రయించేందుకు ప్రయత్నించగా పక్కా సమాచారంతో శంషాబాద్ ఎక్సైజ్ పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. నిందితులను విచారిస్తున్నామని పూర్తి వివరాలను శనివారం తెలుపుతామని ఇన్‌స్పెక్టర్ వెల్లడించారు.

ఆరోగ్యం.. మేధస్సు పెంచేదిశగా...

విద్యార్థులకు పౌష్టికాహారం

రాగి పిండి, బెల్లం పొడి ప్యాకెట్ల మిశ్రమం

- సర్కారు బడుల్లో సరఫరాకు చర్యలు
- స్వచ్ఛంద సంస్థల సంపూర్ణ సహకారం
- విద్యార్థుల పరిపూర్ణ ఆరోగ్యమే లక్ష్యం



రాగి పిండి, బెల్లం మిశ్రమాన్ని అత్తాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సరఫరా చేస్తున్న దృశ్యం (ఫైల్)



అత్తాపూర్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు పరిపూర్ణ ఆరోగ్యంతో పాటు మేధస్సును మరింత బలోపేతం చేసేదిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందులో భాగంగా విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందిస్తున్నారు. స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో రుచి, శుచి ఆరోగ్యకరమైన, బలవర్ధకమైన ఆహారంలో భాగంగా రాగి పిండి, బెల్లం పొడితో తయారు చేసిన జావను మధ్యాహ్న భోజనానికి ముందు బ్రేక్ సమయంలో అందిస్తున్నారు. అర్ధాకలితో అలమటిస్తున్న విద్యార్థులకు రాగి పిండి, బెల్లంతో తయారు చేసిన మిశ్రమం విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుంది. చదువుపై ఏకాగ్రత పెంచేందుకు ఈ మాల్టు ఎంతగానో ఉపయోగపడుతుందని న్యూట్రిషనిస్టులు స్పష్టం చేస్తున్నారు. వారం రోజుల్లో మూడు రోజులు రాగి మాల్టు మరో మూడు రోజులు కోడి గుడ్లు విద్యార్థులకు అందిస్తున్నారు. స్వచ్ఛంద సంస్థ వారు రాగి పిండి బెల్లం పౌడర్ ట్రాన్స్‌పోర్ట్‌ల ద్వారా మండల విద్యాశాఖ కేంద్రాలకు సరఫరా అవుతుంది. మండల కేంద్రాలకు చేరుకున్న ఈ మిశ్రమాలను విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా స్థానికంగా ఉన్న పాఠశాలలకు మండల విద్యాధికారులు అందజేస్తున్నారు. విద్యార్థులు ఎంతో ఇష్టంగా రాగి పిండి బెల్లం పొడితో తయారు చేసిన బలవర్ధకమైన మిశ్రమాన్ని తీసుకుంటూ ఆరోగ్యంగా ఉంటున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

- తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలకు రాగి పిండి, బెల్లం పొడిని సరఫరా చేసేందుకు స్వచ్ఛంద సంస్థలు సిద్ధంగా ఉన్నాయి. ప్రభుత్వ ఆదేశాలు వచ్చిన వెంటనే పూర్తిస్థాయిలో రంగారెడ్డి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలకు అందిస్తారు. త్వరలో రాజేంద్రనగర్ మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు రాగి పిండి, బెల్లం పొడి సరఫరా చేస్తామని రాజేంద్రనగర్ మండల విద్యాధికారి కేశవత్ శంకర్ రాథోడ్ తెలిపారు.

ఘనంగా 'నూనె గింజల' సంస్థ వ్యవస్థాపక దినోత్సవం



అవార్డులు అందుకున్న రైతులు, శాస్త్రవేత్తలు

ఏజీవర్సిటీ: భారతీయ నూనె గింజల పరిశోధన సంస్థ 49 వ్యవస్థాపక దినోత్సవం శుక్రవారం సంస్థ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ డి.కె. యాదవ్ మాట్లాడారు. దేశంలో నూనె కొరత చాలా ఉందని, రైతులు నూనె గింజల ఉత్పత్తి పై దృష్టి సారించే విధంగా రైతులకు అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. నూనె గింజల సాగులో నూతన అవిష్కరణలు, యాజమాన్య పద్ధతులు అవలంబించాలని..ముఖ్యంగా పొద్దు తిరుగుడు, ఆముదం, నువ్వులు, కుసుమ పంటలకు చెందిన అధిక దిగుబడినిచ్చే రకాల విత్తనాలను రైతులకు పరిచయం చేయాలని శాస్త్రవేత్తలకు సూచించారు. నూనె గింజల పంటల ద్వారా రైతులకు అధిక దిగుబడులు వచ్చేలా యాజమాన్య పద్ధతుల ద్వారా పంటలు పండిచేలా చూడాలని తెలిపారు. నూనె గింజల పంటల ప్రతిభ కనబరచిన రైతులను సన్మానించారు. ఉత్తమ ప్రతిభ కనబరచిన శాస్త్రవేత్తలు, టెక్నికల్, అడ్మినిస్టేట్ సిబ్బందికి అవార్డులు అందజేశారు. అవార్డులు పొందిన వారిలో ఐసీఏఆర్ యంగ్ సైంటిస్ట్ అవార్డు డాక్టర్ కె.ఎస్.వి.పి.చంద్రిక, డాక్టర్ దురైముర్గన్, డాక్టర్ శాంత లక్ష్మి, బెస్ట్ వర్కర్స్‌గా పి.మేరి, ఘణప్రసూన, బాలామణి పి.కృష్ణ, పి.శ్రీనివాస్‌రావు అవార్డులు అందుకున్నారు. ఐఐఓఆర్ డైరెక్టర్ ఆర్.కె.మాధురి, కావేరి, విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రవీణ్‌రావు, ఐసీఏఆర్, ఐఐఓఆర్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

సర్కారు బడుల్లో ఫేస్ రికగ్నైజేషన్ షురూ

కొంతమందికే పనిచేసిన ఎఫ్‌ఆర్‌ఎస్



హాజరు ఇలా...

అత్తాపూర్: ఫేస్ రికగ్నైజేషన్ సిస్టం ద్వారా అటెండెన్స్ విధానం కొంత మంది ఉపాధ్యాయులకు ఇబ్బందికరంగా మారింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖ అధికారులు తీసుకున్న నిర్ణయంలో భాగంగా ఆగస్టు 1వ తేదీ నుంచి పాఠశాల ప్రాంగణం నుంచి మాత్రమే చెకిన్, చెక్ అవుట్ కావాల్సి ఉంటుంది. పాఠశాలకు ఏ సమయంలో వచ్చింది, పాఠశాల నుంచి ఎప్పుడు వెళ్తున్నారు అనేది వారి ఫోన్ల ద్వారా ఎఫ్‌ఆర్‌ఎస్ విధానం అమలు జరుగుతుంది. పాఠశాల పరిసర ప్రాంతాలలో నెట్‌వర్క్ ప్రాబ్లం కానీ రూపురేఖలు వేషధారణ మారితే ఫేస్ రికగ్నైజేషన్ సిస్టం చేయకపోవడంతో హాజరుపడటం లేదు. శుక్రవారం మొదటి రోజు కొంత మంది ఉపాధ్యాయులకు ఎఫ్‌ఆర్‌ఎస్ విజయవంతం కాగా తక్కువ శాతం ఉపాధ్యాయులకు ఫేస్ రికగ్నైజేషన్ కాలేదు. పాఠశాలలకు ఉపాధ్యాయులు ఎప్పుడు వస్తున్నారు... ఎప్పుడు వెళ్తున్నారు... అనేది ఎప్పటికి అప్పుడు అప్‌డేట్ అవుతుంది. సమయం, సందర్భం లేకుండా పాఠశాలలకు వచ్చే ఉపాధ్యాయులకు మాత్రం ఎఫ్‌ఆర్‌ఎస్ విధానం ప్రతి రోజే పరీక్షే అని చెప్పకతప్పదు.

సమస్యల పరిష్కారంపై శ్రద్ధ చూపాలి



దుర్గానగర్‌లో సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

మైలార్‌దేవ్‌పల్లి: కాలనీలు, బస్తీల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల సత్వర పరిష్కారంపై అధికారులు ఎప్పటికప్పుడు శ్రద్ధ వహించాలని బీజేపీ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని దుర్గానగర్‌లో స్థానికుల విజ్ఞప్తి మేరకు దెబ్బతిన్న భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ, దెబ్బతిన్న నాలా బాక్స్ డ్రైన్ వ్యవస్థ సంబంధిత సమస్యలను జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులతో కలిసి పర్యవేక్షించారు. ప్రజల సమస్యలు పట్టించుకోవడం లేదని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ మాన్‌సూన్, హైడ్రా సిబ్బందితో తక్షణమే సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. రెండు మూడు రోజుల్లో డ్రైనేజీ పైపులైన్ పనులు ప్రారంభమవుతాయన్నారు. నాలాకు సంబంధించిన పనులు కూడా ప్రారంభిస్తామని స్థానికులకు హామీ ఇచ్చారు. నేతలు మన్మోహన్‌రెడ్డి, శ్రీనివాస్, మల్లేష్‌యాదవ్, బొమ్మ రాజు నర్సింహ, శ్రావణ్‌గౌడ్, జిత్తు, కిషోర్, శేఖర్, రాజుయాదవ్, గణేష్‌గౌడ్, మధుసూధన్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, జీహెచ్‌ఎంసీ ఏఈ నర్సింహ్మమూర్తి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాహుల్, జలమండలి మేనేజర్ ప్రసాద్, జీహెచ్‌ఎంసీ జవాన్ శేఖర్, హైడ్రా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శ్రీ చైతన్య కళాశాలలో పెప్పర్ స్ప్రే కలకలం

మణికొండ: శ్రీ చైతన్య ఇంటర్మీడియట్ కళాశాలలో పెప్పర్ స్ప్రే శుక్రవారం కలకలం సృష్టించింది. బాధిత విద్యార్థుల తల్లిదండ్రులు తెలిపిన వివరాల ప్రకారం..మణికొండలోని శ్రీ చైతన్య జూనియర్ డే స్కాలర్ కళాశాలలో శుక్రవారం ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్న ఓ విద్యార్థిని తన బ్యాగ్‌లో పెప్పర్ స్ప్రే తీసుకువచ్చింది. దాన్ని మరో విద్యార్థిని బ్యాగులో నుంచి తీసి కిటికీలోంచి బయటకు స్ప్రే చేయగా..అది కాస్త పక్క తరగతి గదుల్లో ఉన్న విద్యార్థుల కళ్లు, నోట్లోకి వెళ్లింది. దీంతో వారు నీరసించి, భయాందోళనకు గురై అపస్మారక స్థితికి వెళ్లారు. వీరికి కళాశాల ప్రిన్సిపాల్ వెంటనే స్థానికంగా ఉన్న ఓ నర్సింగ్ హోంలో చేర్పించి చికిత్స చేయించారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు ఆసుపత్రికి చేరుకున్నారు. పెప్పర్ స్ప్రే తీసుకువచ్చిన విద్యార్థినితో..ఆమె తండ్రితో బాధితులు వాగ్వాదానికి దిగారు. సదరు విద్యార్థినికి టీసీ ఇచ్చి పంపాలని డిమాండ్ చేశారు. దీనిపై ప్రిన్సిపాల్ రాయదుర్గం పోలీసులకు ఫిర్యాదు చేయటంతో వారు విచారణ చేపట్టారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ సంపత్ మాట్లాడుతూ విద్యార్థినులు కళాశాలకు పెప్పర్‌స్ప్రే తేవడం తప్పేనని అన్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశామని, ఇరు వర్గాలకు సర్ది చెబుతున్నామని చెప్పారు.

బీఆర్‌ఎస్‌ను మరింత పటిష్టం చేయాలి

మాజీ మంత్రి సబితారెడ్డి



మాజీ మంత్రి సబితారెడ్డి సమక్షంలో పార్టీలో చేరిన, పదవులు పొందిన యువకులు

మణికొండ: రాజేంద్రనగర్ నియోజకవర్గంలో కొందరు బీఆర్‌ఎస్ పార్టీని వీడినా పార్టీ కేడర్ ప్రజాభిమానం అలాగే ఉందని, రాబోయే రోజుల్లో వాటిని సద్వినియోగం చేసుకుని పార్టీని మరింత పటిష్టం చేయాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి అన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ మణికొండ మున్సిపాలిటీ అధ్యక్షుడు డి.సీతారం ఆధ్వర్యంలో ఆమె సమక్షంలో కొందరు పార్టీలో చేరారు. మరికొందరికి యువత విభాగంలో నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఇప్పటికే చేపడుతున్న పలు సర్వేలలో రాబోయే ఎన్నికల్లో రాజేంద్రనగర్‌లో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి గెలుస్తారని వస్తున్నదని, అందుకు అనుగుణంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు కష్టపడి పనిచేయాలన్నారు.

యువత విభాగం నియామకాలు...

బీఆర్‌ఎస్ పార్టీ మణికొండ మున్సిపాలిటీ యువత విభాగం అధ్యక్షుడు ఎస్.శ్రీకాంత్ ఆధ్వర్యంలో పూర్తి కమిటీని నియమించారు. అందులో భాగంగా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పి.శివకుమార్, ప్రధాన కార్యదర్శిగా ఎం. సుమన్, ఉపాధ్యక్షులుగా కె.ప్రవీణ్, ఎ.తిరుపతి, కార్యదర్శిగా ఎం.శ్రవణ్‌లను నియమించి మాజీ మంత్రి చేతుల మీదుగా నియామక పత్రాలను అందించారు. వీరితో పాటు మైనార్టీ విభాగం అధ్యక్షుడు కె.జయరాం సమక్షంలో ప్రధాన కార్యదర్శిగా బి.శ్యామ్‌సుంబర్, ఉపాధ్యక్షులుగా యాలాల బెన్ని, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఎం. కృపాకర్, ఉప కార్యదర్శిగా రఘువంశీ, కోశాధికారిగా శేషనాగ్ షిండేలకు నియామక పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇంచార్జి పి. కార్తీక్ రెడ్డి, మున్సిపాలిటీ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆవిష్కరణలకు వర్సిటీ ఆర్థిక సాయం

ఏజీవర్సిటీ: విశ్వవిద్యాలయం పరిధిలోని పరిశోధకులు, విద్యార్థుల పేటెంట్, యోగ్యమైన అవిష్కరణలకు వర్సిటీ ఆర్థిక సాయం అందిస్తుందని ఉద్యాన విశ్వవిద్యాలయం వీసీ దండా రాజిరెడ్డి అన్నారు. శుక్రవారం శ్రీ కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో ఉద్యాన వన రంగంలో ఐపీఆర్ అవగాహనపై జాతీయ వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ వర్క్‌షాప్ పాల్గొన్న వీసీ మాట్లాడుతూ.. రైతుల ఆవిష్కరణలను బలమైన మేధో సంపత్తి హక్కులతో కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కనీసం నెలకు ఒక పేటెంట్ దాఖలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు, ఈ విషయాన్ని విశ్వవిద్యాలయం అధ్యాపకులు, విద్యార్థులు దృష్టిలో ఉంచుకోవాలని కోరారు. వర్సిటీ ఆధ్వర్యంలో బాలానగర్ సీతాఫలం, ఆర్మూర్ పసుపుకు భౌగోళిక గుర్తింపు రిజిస్ట్రేషన్ జరుగుతుందని అన్నారు. జాతీయ సదస్సు ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ పిగడం సైదయ్య మాట్లాడుతూ... ఉద్యాన వారసత్వం, సంప్రదాయ ఉద్యాన పద్ధతులు, చట్టబద్ధంగా గుర్తింపు పొందేందుకు మేదోసంపత్తి హక్కులను అన్వయించేందుక వర్సిటీ కృషి చేస్తుందని తెలిపారు. కార్యక్రంలో డీన్ చీనా నాయక్, రిజిస్ట్రార్ భగవాన్ అసిస్టెంట్ ప్రొఫెసర్స్, పరిశోధన విద్యార్థులు పాల్గొన్నారు.

నేతాజీ స్ఫూర్తితో సమాజ చైతన్యం

అత్తాపూర్: నేతాజీ సుభాష చంద్రబోస్ ఆశయాల సాధనే లక్ష్యంగా ఆయన స్ఫూర్తితో యువత సమాజ చైతన్యం కోసం సంఘటితంగా ముందుకు కదలాలని అత్తాపూర్ డివిజన్ హైదర్‌గూడ పుర ప్రముఖులు పిలుపునిచ్చారు. హైదర్‌గూడలోని సుభాష్ చంద్రబోస్ విగ్రహం వద్ద శుక్రవారం నేతాజీ సుభాష్ చంద్రబోస్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన జాతీయ పతాక ఆవిష్కరణ కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీ నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు, పుర ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ... యువత లైబ్రరీ, డిజిటల్ లైబ్రరీలు, కమ్యూనిటీ హాల్స్ ఏర్పాట్ల ద్వారా సమాజంలో మరింత చైతన్యం తీసుకురావడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్ వంటి అసాంఘిక దురాచారాల నిర్మూలనకు నడుం బిగించాలని సూచించారు. వివిధ రాజకీయ పార్టీల నాయకులు కొలన్ సుభాష్‌రెడ్డి, మేడం రామేశ్వరరావు, నారగూడెం మల్లారెడ్డి, సనివెల్లి శేఖర్‌రెడ్డి, చెట్టిగారి నరేందర్, సోమారం రాజ్‌కుమార్, రవీందర్, నల్లింగ్ రమేష్, జయానంద్‌రెడ్డి, కాశీవిశ్వనాథ్‌గౌడ్, పెంటారెడ్డి, బాల్‌రెడ్డి, విజయ్ కుమార్, నేతాజీ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు సులిగే వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ దస్తావేజులతో ప్లాటు విక్రయించే యత్నం: నలుగురి రిమాండ్



నిందితులు

శంషాబాద్: నకిలీ దస్తావేజులు తయారు చేసి దాంతో ఓ ప్లాటును అమ్మేందుకు యత్నించిన నలుగురిని శంషాబాద్ పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ నరేందర్‌రెడ్డి సమాచారం మేరకు... చౌదరిగూడ గ్రామానికి చెందిన మన్నె ప్రవీణ్(35) తన సహచరులు కొమ్ము వెంకటేష్, సర్పరాజ్, ముస్తపా అలీలతో కలిసి చౌదరిగూడలో ఉన్న ముసావెంచర్‌లో అతడి పేరిట ముస్తా (చనిపోయిన) అనే వ్యక్తి తనకు 100 నోటరీలపై ప్లాట్లను విక్రయించినట్లు నకిలీవి తయారు చేశాడు. దాంతో పాటు జిల్లా రిజిస్ట్రార్ సంతకం, స్టాంపులు తయారు చేసి వాటి ద్వారా నకిలీ రిజిస్ట్రేషన్ పత్రాలను కూడా సృష్టించారు. ఇటీవల ఓ ప్లాటు యజమానికి దీనిపై ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని పత్రాలను పరిశీలించగా నకిలీ పత్రాలతో ప్లాట్లు విక్రయించేందుకు యత్నించినట్లు గుర్తించారు. ఈ మేరకు రిమాండ్‌కు తరలించారు. వారి వద్ద నున్న నకిలీ దస్తావేజులను స్వాధీనం చేసుకున్నారు.

నేటి నుంచి టేబుల్ టెన్నిస్ టోర్నీ

మైలార్‌దేవ్‌పల్లి: మహవీర్ గ్రూప్ కళాశాలల సౌజన్యంతో స్వర్గీయ సంరెడ్డి సుదర్శన్‌రెడ్డి జ్ఞాపకార్థం 11వ తెలంగాణ రాష్ట్ర స్థాయి ర్యాంకింగ్ టేబెల్ టెన్నిస్ టోర్నమెంట్ ఈ నెల 2వ తేదీ నుంచి 10వ తేదీ వరకు కళాశాల ఇండోర్ ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను మహవీర్ గ్రూప్ కళాశాల సెక్రటరీ సంరెడ్డి సురేందర్ రెడ్డి, తెలంగాణ టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ సెక్రటరీ పి.నరేందర్‌రెడ్డి, కళాశాల జాయింట్ సెక్రటరీ సంరెడ్డి ధనుంజయ్‌రెడ్డి, చైర్మన్ ఎస్.జయలక్ష్మి, మెంటర్ ప్రకాష్‌రాజు వెల్లడించారు. అండర్-11, 13, 15, 17, 19 మెన్ అండ్ ఉమెన్‌కు చెందిన 500 మంది పాల్గొననున్నారని తెలిపారు. ఈ టోర్నమెంట్‌ను నిజామాబాద్ ఎమ్మెల్సీ కొముదయ్య మల్కా ప్రారంభిస్తారన్నారు. క్రీడాకారులకు భోజనంతో పాటు వసతి సౌకర్యాలు యాజమాన్యం కల్పిస్తుందని వారు పేర్కొన్నారు. విజేతలకు నగదు పారితోషకంతో పాటు మెమొంటోలు, షీల్డ్‌లు అందజేస్తామని వివరించారు.

వేడుకగా శ్రావణ శుక్రవారం పూజలు



రాజేంద్రనగర్: శ్రావణ శుక్రవారం సందర్భంగా రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజాము నుంచి భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారి దేవాలయాలకు తరలివచ్చి పూజలు నిర్వహించారు. రెండో శుక్రవారం కావడంతో ఆయా ప్రాంతాల్లోని మహిళలు తమ ఇండ్లల్లో వరలక్ష్మీ పూజను చేసుకున్నారు. ముత్తయిదువులను పిలిచి పసుపు, కుంకుమలను అందజేశారు. ఈ సందర్భంగా తమఇండ్లలో అమ్మవారిని అందంగా అలంకరించి వివిధ రకాల పూలు, పండ్లు, స్వీట్లతో అలంకరించారు. రాజేంద్రనగర్, శివరాంపల్లి, మైలార్‌దేవ్‌పల్లి, కాటేదాన్, అత్తాపూర్, బండ్లగూడ, నార్సింగ్, మణికొండ, శంషాబాద్ మున్సిపాలిటీల పరిధిలో దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. సంప్రదాయ దుస్తుల్లో మహిళలు పూజా కార్యక్రమాలకు హాజరయ్యారు.

మ్యాన్‌హోల్స్‌కు మరమ్మతులు



అత్తాపూర్: అత్తాపూర్ డివిజన్ పరిధిలో అధ్వాన స్థితికి చేరుకున్న మ్యాన్‌హోల్స్ అధికారులు మరమ్మతులు చేస్తున్నారు. ప్రమాదకరంగా తయారవుతున్న మ్యాన్‌హోల్స్ కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై 'అధ్వాన స్థితిలో మ్యాన్‌హోల్' అనే శీర్షికన 'సాక్షి' దినపత్రికలో గురువారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. శుక్రవారం అత్తాపూర్ బాపుఘాట్ బ్రిడ్జి వైపు వెళ్లే రహదారిపై హనుమాన్ ఆలయం సమీపంలో ప్రధాన రహదారిపై పగిలిన మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు చేశారు. పలు ప్రాంతాల్లో కొత్త మ్యాన్‌హోల్స్ ఏర్పాటు చేస్తున్నారు.

PUBLIC NOTICE

The members of general public are hereby informed that our, client is intending to purchase land admeasuring Ac. 0-08 gts in Sy. No. 100/ఆ/ఆ/2 and land admeasuring Ac. 0-10 gts in Sy. No. 101/ఆ2/2 totally admeasuring Ac.0-18 gts situated at Ramanjapur Village, Shamshabad Mandal, Ranga Reddy District from its owner and possessor Sri. A. Gopal Reddy. If any member of general public, entity, bank or financial institution has any right, title, claims or interest in respect of the said property or any part thereof, they are hereby called upon to furnish documentary proof and particulars of such claim along with notarized copies of the documents etc., to the undersigned within a period of [7] days from the date of this publication failing which it shall be presumed that (i) No adverse right, title, interest, share, claim or demand of any nature whatsoever exists into or upon or in respect of subject property, (ii) there is no objection to the proposed acquisition of the subject property by our client (iii) the title and possession of the owners mentioned above to the subject property is clear and marketable and any objections raised subsequently will not be entertained.

Sd/- M. NARSIMHA REDDY Advocate
M/s Ganu and Co Advocates
201-202, 3-5-874/A Vipanchi Estates,
Hyderguda, Hyderabad 500 029

నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలి



మణికొండ: పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు నాయకత్వ లక్షణాలను అలవర్చుకుని జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మణికొండ మున్సిపాలిటీ మాజీ చైర్మన్ కె.నరేందర్ ముదిరాజ్ అన్నారు. మున్సిపాలిటీ కేంద్రంలోని శ్రీ చైతన్య పాఠశాలలో శుక్రవారం ఇన్వెస్టిచర్ వేడుకలు నిర్వహించి హెడ్ బాయ్, హెడ్ గర్ల్, హౌస్ కెప్టెన్‌లను ఎంపిక చేసి వారికి బ్యాడ్జ్‌లను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యార్థులు చిన్నప్పటి నుంచే సమస్యల పరిష్కారం, పది మందికి ఆదర్శంగా నిలిచేతత్వాన్ని పెంపొందించుకోవాలన్నారు. అలాంటి వారిని చూసి మిగతా విద్యార్థులు వారిలా రాణించేందుకు ప్రయత్నించాలన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ అనిత మాట్లాడుతూ... విద్యార్థులలో క్రమశిక్షణ, పోటీతత్వం పెంపొందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఏజీఎం శివరామకృష్ణ, ఆర్ఐ అనిత, కో ఆర్డినేటర్ రాజ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మి పాల్గొన్నారు.